సాక్షి జగిత్యాల

శనివారం ॥ 18 ॥ ఫిబ్రవరి ॥ 2023



గోదావరిలో పుణ్యస్నానాలు

ధర్మపురి: ధర్మపురి గోదావరిలో శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు పుణ్యస్నానాలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పుణ్యస్నానం ఆచరించారు.



వెంకన్నకు పూజలు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్వామివారికి క్షీరాభిషేకం చేశారు.

గరిష్టం/కనిష్టం
33.0/16.0

వాతావరణం

వాతావరణం సాధారణంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి. చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

సంపాదించిన దాంట్లో కొంతైనా పొదుపు చేయాలి



రన్‌ను ప్రారంభిస్తున్న మకరంద్

జగిత్యాలఅగ్రికల్చర్: సంపాదించడం గొప్ప కాదు, దాంట్లో ఖర్చులు తగ్గించి, కొంతైన పొదుపు చేయడమే గొప్పని అడిషనల్ కలెక్టర్ మకరంద్ అన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై 2కె వాకథాన్‌ను నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. అక్షరాస్యత గురించి అవగాహన కల్పించే రోజులు పోయి, ఇప్పుడు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించే రోజులు వచ్చాయన్నారు. ఎన్ని కోట్లు సంపాదించినా, ఆర్థిక క్రమశిక్షణ ఉంటేనే జీవితం ఉన్నతంగా ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరు ఆర్థిక విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పొన్న వెంకట్‌రెడ్డి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆర్‌ఎం గంగాధర్, డీఎస్సీ డీవో రాజ్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సాయిబాబా, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ మధుసూదన్ పాల్గొన్నారు.

మనఊరు- మనబడి పనులు వేగవంతం చేయాలి



దోనూర్‌లో పనులు పరిశీలిస్తున్న డీఈవో

ధర్మపురి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మనఊరు- మనబడి పనులు వేగవంతం చేయాలని జిల్లా విద్యాధికారి బొల్లం జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. మండలంలోని దోనూర్, జైనా గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. మనఊరు- మనబడి పనుల ప్రగతిని పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. జైనా జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మండల విద్యాధికారి భూమయ్య, ఏఈ బోగ సతీశ్, ప్రధానోపాధ్యాయులు కాశెట్టి రమేశ్, గడిపెల్లి అనూష, బక్కశెట్టి రవీందర్, భాస్కర్ ఉన్నారు.

చేతివృత్తుల వారికి ఆధునిక శిక్షణ



మాట్లాడుతున్న నాబార్డ్ ఏజీఎం మనోహర్

జగిత్యాలరూరల్: చేతివృత్తుల వారికి ఆధునిక సాంకేతికతతో ప్రభుత్వం ఉపాధి అవకాశాలు అందిస్తోందని నాబార్డ్ ఏజీఎం మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలో చేతిబుట్టలు అల్లే మహిళాసంఘ సభ్యుల యూనిట్లను సందర్శించారు. ప్రస్తుతం చేతివృత్తుల వారికి ఆధునిక శిక్షణ ద్వారా ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందని అన్నారు. నాబార్డ్ ద్వారా ఆధునిక బట్టల అల్లకంపై త్వరలోనే శిక్షణ తరగతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. మహాత్మగాంధీ నేషనల్ ఫెలో నవ్య మాట్లాడుతూ, మహిళా సంఘ సభ్యులకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏపీఎం గంగాధర్, సర్పంచ్ జలేందర్, జనవికాస్ సంస్థ సీఈవో సంపత్‌కుమార్, సీసీ సంతోశ్, వీవో అధ్యక్షురాలు గంగభవాని ఉన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



అద్దాలు అందిస్తున్న శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): 18 సంవత్సరాల పైబడిన ప్రతిఒక్కరూ కంటివెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని కంటివెలుగు ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు.వేములకుర్తి గ్రామంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. కంటి పరీక్షలకు వచ్చేవారు ఆధార్‌కార్డు, ఎఫ్ఎస్‌సీకార్డు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఏఎన్‌ఎంలతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. వైద్యాధికారి రాజేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశం, సీనియర్ అసిస్టెంట్ విజయరాణి, ఫార్మసిస్ట్ ఉదయ్‌ప్రసాద్, స్టాఫ్‌నర్సు రాజేందర్, ల్యాబ్ టెక్నిషియన్ నరేశ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్.. పక్కదారి..!



షాపులో తనిఖీ చేస్తున్న గత మున్సిపల్ కమిషనర్ (ఫైల్)

- జగిత్యాలలో సీజ్ చేసిన ప్లాస్టిక్ మాయం..
- మూడేళ్లలో పదిటన్నుల ప్లాస్టిక్ పట్టివేత
- డంపింగ్‌యార్డులో ఉంది మూడు టన్నులే
- స్వాధీనం చేసుకున్న దుకాణాలకే మళ్లీ తరలింపు
- ప్లాస్టిక్ నిల్వల విషయంలో మున్సిపల్ సిబ్బంది చేతివాటం

జగిత్యాల: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు క్షేత్రస్థాయిలో ఫలితం ఇవ్వడం లేదు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కొందరు సిబ్బంది చేతివాటం లక్ష్యాన్ని నీరుగారుస్తోంది. దొంగచేతికి తాళాలు అందించినట్లు జగిత్యాల మున్సిపాలిటీలోని కొందరు సిబ్బంది పరిస్థితి తయారైంది. 775 మైక్రాన్ల మందం గల ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించింది. అప్పటి నుంచి జగిత్యాల మున్సిపల్ అధికారులు పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులను సీజ్‌చేసి జరిమానాలు విధిస్తున్నారు. సీజ్ చేసిన ప్లాస్టిక్‌ను జిల్లా కేంద్రంలోని నల్లగుట్ట ప్రాంతంలో ఉన్న డంపింగ్‌యార్డుకు తరలించగా.. అక్కడ కొందరు పారిశుధ్య విభాగానికి చెందిన సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టుకున్న ప్లాస్టిక్‌ను పక్కదారి పట్టిస్తున్నారని... ఏ దుకాణంలో సీజ్ చేశారో.. మళ్లీ వారికే అప్పజెప్పుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

- ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధాన్ని అమలులోకి తెచ్చాక 2019 నుంచి జగిత్యాల మున్సిపాలిటీలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ మూడేళ్లకాలంలో దాదాపు 10 టన్నులకు పైగా ప్లాస్టిక్‌ను సీజ్‌చేసి మున్సిపల్ కార్యాలయం, అక్కడినుంచి నల్లగుట్ట ప్రాంతంలో ఉన్న డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు.
- అయితే ఇక్కడ చాలావరకు ప్లాస్టిక్ వస్తువులు మాయం అవుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. సీజ్ చేస్తున్న వస్తువులు డంపింగ్‌యార్డులోని డీఆర్‌సీసీ సెంటర్‌లో భద్రపరిచామని చెబుతున్నా అంతమొత్తంలో ప్లాస్టిక్ అక్కడ కనిపించడం లేదని సమాచారం.
- గత మూడేళ్లలో దాదాపు 10 టన్నులకు పైగానే ప్లాస్టిక్ పట్టుకున్నట్లు తెలిసింది. అయితే ప్రస్తుతం నిల్వ ఉన్న ప్లాస్టిక్ మూడు టన్నులు మాత్రమేనని అధికారులు చెబుతున్నారు.
- పట్టుకున్న ప్లాస్టిక్‌ను చాలావరకు కొంతమంది సిబ్బంది పలువురు దుకాణ నిర్వాహకులతో మాట్లాడుకుని పక్కదారి పట్టించినట్లు తెలిసింది. ఎక్కడైతే సీజ్ చేశారో ఆ షాపునకే మళ్లీ ఇస్తున్నట్లు సమాచారం.
- ప్లాస్టిక్‌కు సంబంధించిన వస్తువులు సీజ్ చేసినప్పుడు ఎంత సీజ్ చేశాం, ఎక్కడకు తరలించామన్నది రికార్డుల్లో కనిపించడం లేదు. ఈ విషయం గురించి మున్సిపల్ అధికారులను అడుగగా జరిమానాకు సంబంధించిన రిసిప్టులు మాత్రమే ఇస్తామని, ఎంత సీజ్ చేస్తున్నాం..? ఎంత ఉంటుందనేది తమవద్ద సమాచారం ఉండదని వివరించారు.
- ప్లాస్టిక్ నిషేధం జగిత్యాల మున్సిపాలిటీలోని పారిశుధ్యవిభాగంలో పనిచేస్తున్న వారికి వరంగా మారింది. ప్లాస్టిక్‌షాపులపై దాడులు చేసి సీజ్ చేసిన వస్తువులను ఎక్కడికో తరలించి, డంపింగ్‌యార్డులో భద్రపరుస్తున్నామని చెబుతున్నారు.
- సీజ్ చేసిన ప్లాస్టిక్‌ను డీఆర్‌సీసీ సెంటర్‌కు తరలించి అక్కడ బయోమైనింగ్ ద్వారా రీసైక్లింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.
- ఈ వ్యవహారం కొంత మంది సిబ్బందికి వరంగా మారింది. అక్రమంగా పక్కదారి పట్టించి కాసులు వెనకేసుకుంటున్నట్లు సమాచారం. దీనిపై జగిత్యాల మున్సిపల్ ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో చూడాలి.

డీఆర్‌సీసీ సెంటర్‌లో నిలువ చేశాం

సీజ్ చేసిన ప్లాస్టిక్‌ను డీఆర్‌సీసీ సెంటర్‌లో నిలువ చేస్తున్నాం. రికార్డుకు ఎంత సీజ్ చేశామన్నది ఉండదు. జరిమానాలు ఎన్ని వేశామన్నది రిసిప్టుల ద్వారానే ఇస్తాం. గత కొంత కాలంగా సీజ్ చేసిన ప్లాస్టిక్ అంతా డీఆర్‌సీసీ సెంటర్‌కు తరలించాం.

– శ్రీకాంత్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్

ఉడుతలు.. పాములు.. కోతులు!



దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్



యూసుఫ్‌నగర్‌లో విద్యుత్ వైర్లు తెగడానికి కారణంగా భావిస్తున్న ఉడుత

- విద్యుత్ ప్రమాదాలకు కారణమే
- ట్రాన్స్‌ఫార్మర్లకు దెబ్బ.. ట్రాన్స్‌కోకు నష్టం

కోరుట్ల: విద్యుత్ వైర్లు తెగిపడటానికి.. ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోవడానికి గాలిదుమారాలు.. ఓవర్‌లోడ్ మాత్రమే కారణం కాకపోవచ్చు. ఒక్కోసారి పశువులు.. ఉడుతలు.. పాములు.. కోతులు వంటి ప్రాణులతో ప్రమాదం పొంచి ఉంది. కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్‌లో ఈనెల 15న 33/11 కేవీ విద్యుత్ వైర్ తెగిపడిన సంఘటనలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఎలాంటి గాలిదుమారాలు.. ఓవర్‌లోడ్ సమస్య లేకుండా అకస్మాత్తుగా విద్యుత్ మెయిన్ లైన్ ఎలా తెగిపడిందని ట్రాన్స్‌కో అధికారులు లోతుగా విచారిస్తే సంఘటన స్థలంలో మహిళతో పాటు చనిపోయిన ఓ ఉడుత కనిపించింది. ఈ ఉడుత విద్యుత్‌వైర్లపై నుంచి స్తంభంపైకి వచ్చే క్రమంలో ఎర్త్ కావడంతో మెయిన్ వైర్లు తెగికిందపడటం.. అవి పూర్తిగా నేలపై పడకుండా చిన్నచిన్న చెట్లపై ఆగిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ కాకుండా విద్యుత్ సరాఫరా కొనసాగడంతో తోటకు వెళ్లిన మహిళ వాటిని తాకడంతో తీవ్రమైన షాక్‌తో కలిపోయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎక్కువగా వీటితోనే..

సాధారణంగా ఏప్రిల్ నెల నుంచి డిసెంబర్ ముగిసే వరకు పంట పొలాల్లో ఓవర్‌లోడ్, వర్షం గాలిదుమారాలతో ఎక్కువగా ట్రాన్స్‌పార్మర్లు దెబ్బతినడం ..వైర్లు తెగిపోవడం జరుగుతుంది. అలా కాకుండా ఎలాంటి వాతావరణ సమస్యలు, ఓవర్‌లోడ్ లేకుండా ఉడుతలు, పక్షులు, పాములు, కోతులు వంటి ప్రాణులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్లపైకి వెళ్లిన సమయాల్లో అనుకోకుండా ఎర్త్ కావడం జరుగుతుంది. ప్రస్తుతం ఎక్కువగా కోతులు, పాముల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, విద్యుత్ వైర్లు తెగిపడటం జరుగుతుందని ట్రాన్స్‌కో సిబ్బంది చెబుతున్నారు. తెగిపడ్డ వైర్లు నేలకు తగిలి ఎర్త్ అయితే ట్రాన్స్‌ఫార్మర్ వెంటనే ట్రిప్ అయి విద్యుత్ సరాఫరా నిలిచిపోతుంది. అలా కాకుండా చెట్లకు, స్తంభాలకు వేలాడుతూ ఉంటే వాటికి కరెంటు సరాఫరా కొనసాగి మనుషులు, పశువులు ఇతర ప్రాణులు చనిపోవడానికి కారణం అవుతున్నాయి.

నెలకు 5నుంచి 15 ట్రాన్స్‌ఫార్మర్లు

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, మల్యాల విద్యుత్ డివిజన్ల పరిధిలో సుమారు 22వేల ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా ఏప్రిల్ నుంచి డిసెంబర్ నెలల్లో ప్రతీ నెల సుమారు 80 నుంచి 100 వరకు ట్రాన్స్‌ఫార్మర్లు గాలిదుమారం, ఓవర్‌లోడ్‌లతో దెబ్బతింటున్నాయి. వీటిలో సుమారు 5 నుంచి 15 వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఉడుతలు, పాములు, పక్షుల, కోతుల కారణంగా దెబ్బతింటున్నాయి. ఇలా దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్ 100 కేవీ అయితే మరమ్మతు కోసం సుమారు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు వస్తోంది. మొత్తం మీద ఉడుతలు, కోతులు, పాములతో జరుగుతున్న ప్రమాదాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని ట్రాన్స్‌కోపై భారం పడటంతో పాటు ఒక్కోసారి రైతుల ప్రాణాలు పోతున్న సంఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం.

వాటితో ప్రమాదమే

పాములు, ఉడుతలు, కోతులు సైతం ఒక్కోసారి ట్రాన్స్‌పార్మర్లు దెబ్బతినడానికి, విద్యుత్ వైర్లు తెగి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ట్రిప్ అయిన ట్రాన్స్‌పార్మర్లు, తెగిపడిన వైర్ల వద్ద చాలా సందర్భాల్లో చనిపోయిన పాములు, కోతులు, ఎలుకలు, ఉడుతలు వంటి ప్రాణులు కనిపిస్తాయి.

– ప్రదీప్, ట్రాన్స్‌కో రిపేరింగ్ సెంటర్ ఏఈ

దారులన్నీ ఎములాడకే..



రాజన్న చెంతకు చేరుకుంటున్న భక్తులు



కళాకారులతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ, తదితరులు

- నేడు మహాశివరాత్రి వేడుకలు
- తరలివస్తున్న అశేష భక్తజనం
- గుడిచెరువులో శివార్చన
- ఉచిత బస్సులు ప్రారంభం
- మూడు రోజులు అన్నదానం
- పోలీసుల భారీ బందోబస్తు

వేములవాడ: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ హరహర మహాదేవ నామస్మరణతో మారుమోగుతుంది. శివమాలధారులు, వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో ఆధ్యాత్మిక క్షేత్రం కిక్కిరిసిపోతుంది. వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాజాతరకు నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే గుడారాలు వేసుకుంటున్నారు. ధర్మగుండంలోకి అనుమతి లేకపోవడంతో షవర్ల వద్ద స్నానాలు చేస్తున్నారు. గుడి ఆవరణలో జాగరణ కోసం భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్జిత సేవలను రద్దు చేసిన ఆలయ అధికారులు లఘు దర్శనాలకు మాత్రమే అనుమతించారు. రూ.3.70 కోట్లతో జాతర ఏర్పాట్లు చేశారు. రాజన్న గుడి చెరువు ఖాళీ స్థలంలో రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో శివార్చనలో భాగంగా 1,600 మంది కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాస్‌ల జారీ విషయంలో ఉద్యోగులు, పురప్రముఖులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మహాశివరాత్రి జాతరకు 3 లక్షల వరకు భక్తులు వస్తారని అధికారుల అంచనా.

ఉచిత బస్సు సేవలు

దేవస్థానం తరపున 14 ఉచిత బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. ఈ సేవలను శుక్రవారం ప్రారంభించారు. తిప్పాపూర్ బస్టాండ్ నుంచి బైపాస్‌రోడ్డు గుండా జగిత్యాల బస్టాండు, గుడిప్రాంతం, బైపాస్‌రోడ్డు ద్వారా కోరుట్లబస్టాండు ప్రాంతాలను కలుపుతూ తిరిగి తిప్పాపూర్ బస్టాండ్ వరకు చేరుకుంటాయి. భక్తుల రద్దీని బట్టి బస్సులను తింపనున్నట్లు డీఎం మురళీకృష్ణ తెలిపారు.

నిరంతర అన్నదానం

జాతర మహోత్సవాలకు వచ్చే భక్తులు, పోలీసు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి స్థానిక వాసవీ సేవా సమితి, మన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఈవో కృష్ణప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ అన్నదానం శని, ఆదివారాలు సైతం కొనసాగుతుందని నిర్వాహకులు మోటూరి మధు, కొమ్మ నటరాజ్ తెలిపారు. దాదాపు 30 వేల మందికి అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

ప్యూరిఫైడ్ వాటర్

వేములవాడఅర్బన్: మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఆలయ ఈవో కార్యాలయం వద్ద, గుడి పక్కన పార్కింగ్ ఏరియా, బద్దిపోచమ్మ గుడి వద్ద రాజన్న జలప్రసాదం మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాట్లు చేశారు.

మొదలైన వేడుకలు

- రాజన్న ఆలయంలో మూడు రోజులపాటు మహాశివరాత్రి వేడుకలు జరుగనున్నాయి. శుక్రవారం తెల్లవారు జామున ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవతో ఉత్సవాలు ఆరంభమయ్యాయి.
- ఉదయం 5 గంటలకు ప్రాతఃకాలపూజను స్థానాచార్యులు అప్పాల భీమశంకరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.
- మధ్యాహ్నం 2.30 గంటలకు స్వామికి మహానివేదన చేశారు.

శనివారం నాటి కార్యక్రమాలు

- శనివారం మహాశివరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. వేకువజామున 3.30 గంటల నుంచి 4 గంటల వరకు ఆలయ శుద్ధి, మంగళవాయిద్యాలు. 4 నుంచి 4.25 వరకు సుప్రభాత సేవ ఉంటుంది.
- ఉదయం 7 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం తరపున జీఈవో, టీటీడీ అర్చకుల బృందం ఆధ్వర్యంలో రాజన్నకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.
- ఉదయం 8 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ పట్టువస్త్రాలు సమర్పిస్తారు. మంత్రులతోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొననున్నారు.
- సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు శివస్వాములకు ప్రత్యేక దర్శన అవకాశం.
- సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు కల్యాణ మంటపంలో మహాలింగార్చన.
- రాత్రి 11.35 నుంచి వేకువజాము 3.30 గంటల వరకు లింగోద్భవం. ఈ కాలంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు.



కోడె మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



వాహనాలతో నిండిన గుడి చెరువు

ఉచిత కోచింగ్ ఒక వరం

- కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

జగిత్యాల: నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం ఉచితకోచింగ్ ఏర్పాటు చేయడం వరమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల ఆధ్వర్యంలో గ్రూప్–2, 3, 4కు సంబంధించిన మూడునెలల ప్రత్యేక ఫౌండేషన్ కోర్సును ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థులందరు ఉద్యోగ సాధనలో మంచి ప్రణాళిక ఏర్పాటు చేసుకుని తప్పకుండా ఉద్యోగం సాధిస్తామన్న గట్టి నమ్మకం, ఆత్మవిశ్వాసంతో చదవాలన్నారు. విజయసాధనలో లక్ష్యసాదనలో స్థిరసంకల్పం ఉండాలని, విజయం చేరేంత వరకు ప్రయత్నం చేస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ నరేశ్, ఎల్‌ఎండీ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి

ప్రతి చోట క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో నిర్లక్ష్యం చేయకూడదని, ప్రతి చోట ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ భాషా

మెరుగైన సేవలు అందించేందుకు పోటీ పడాలి

జగిత్యాలజోన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంకులు పోటీ పడాలని కలెక్టర్ యాస్మిన్ భాషా అన్నారు. జిల్లా సమీకృత కలెక్టర్ సముదాయంలో శుక్రవారం యూనియన్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఖాతాదారులకు నాణ్యమైనసేవలు అందిస్తూ.. వారి అభిమానాన్ని చూరగొనాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ లత, యూబీఐ చీఫ్ జనరల్ మేనేజర్ సురేశ్‌చంద్ర తేలి, రీజనల్ హెడ్ ఆఫీ సర్ అరుణ్‌కుమార్, డిప్యూటీ రీజనల్ హెడ్ ఆఫీసర్లు అత్మారాం, వంశీకృష్ణ, శ్రీరాం, లీడ్ బ్యాంకు మేనేజర్ పి.వెంకట్‌రెడ్డి, జగిత్యాల మెయిన్ బ్రాంచ్ మేనేజర్ గౌతం లక్ష్మీనారాయణ, కలెక్టరేట్ బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసు పథకాలను ప్రజలకు చేరువ చేయాలి



జగిత్యాలజోన్: పోస్టాఫీసు పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని కరీంనగర్ డివిజన్ పోస్టల్ ఎస్పీ వై.వెంకటేశ్వర్లు సూచించారు. భారత తపాలాశాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20 నుంచి 24వరకు అందించేసేవలు, పథకాలపై మహామేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు శుక్రవారం పోస్టాఫీసు ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. పోస్టాఫీసు పథకాలపై ఇటీవల ప్రభుత్వం వడ్డీరేట్లు పెంచిందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.సుకన్యఖాతా, మంత్లీ ఇన్‌కం, టీడీ, ఆర్‌డీ, ఎస్బీఖాతాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఏదో ఒక పోస్టల్ స్కీం ఉండేలా చూడాలని, మహామేళాను విజయవంతం చేసి కరీంనగర్ డివిజన్‌ను ప్రథమస్థానంలో ఉంచాలన్నారు.

ఘనంగా శ్రీ దుబ్బరాజేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణం వీక్షిస్తున్న భక్తులు

సారంగాపూర్: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం పెంబట్ల– కోనాపూర్ దుబ్బరాజేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. అదనపు కలెక్టర్ మకరంద్ పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కల్యాణంలో భాగంగా స్వామివారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పెంబట్ల గ్రామానికి చెందిన ఆలయ అర్చకుడు మధు ఇంటినుంచి ఎదుర్కొచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై పరమేశ్వరుడు, పార్వతిదేవిని ఆసీనులను చేసి కల్యాణ తంతు నిర్వహించారు. ఎంపీపీ కోల జమున, ఈవో కోస్న కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, సర్పంచ్‌లు బొడ్డుపల్లి రాజన్న, ఆకుల జమున, విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మకరంద్

శనివారం మహాశివరాత్రి సందర్భంగా వేకువజామున నాలుగు గంటల నుంచే దర్శనాలకు అనుమతి ఇవ్వనున్నారు. రాత్రి 12గంటలకు లింగోద్భవ కాలమున, నిశిపూజ ఉంటుందని అర్చకులు తెలిపారు. శివరాత్రి సందర్భంగా లక్షకుపైగా భక్తులు దర్శించునే అవకాశం ఉంది.

క్లుప్తంగా

చెన్నకేశవనాథ ఆలయంలో జిల్లా జడ్జి పూజలు



ఆలయంలో పూజ చేస్తున్న జడ్జి దంపతులు

రాయికల్: పట్టణంలోని పురాతన చెన్నకేశవనాథ ఆలయంలో శుక్రవారం జిల్లా జడ్జి నీలిమ దంపతులు ప్రత్యేక పూజలుచేశారు. అర్చకులు సతీశ్‌శర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలుకగా ప్రత్యేక పూజల అనంతరం మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు ఆలయకమిటీ అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి జడ్జి దంపతులను సన్మానించారు. ఆలయకమిటీ సభ్యులు సదాశివరెడ్డి, రమేశ్, శంకర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపాధి పునరావాస పథకం

జగిత్యాల: దివ్యాంగులు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం దివ్యాంగులకు ఉపాధి పునరావాస పథకం ప్రవేశపెట్టిందని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ పథకంలో బ్యాంక్ లింకేజీ లేకుండా నేరుగా రూ.50వేలు సబ్సిడీ, బ్యాంక్ లింకేజీతో రూ.లక్ష యూనిట్‌కు రూ.80వేల సబ్సిడీ, రూ.2లక్షల యూనిట్‌కు రూ.1.40 లక్షల సబ్సిడీ, రూ.3 లక్షల యూనిట్‌కు రూ.1.80 లక్షల సబ్సిడీ ఇస్తున్నారన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకంలో జగిత్యాల జిల్లాకు 26 యూనిట్ల ద్వారా రూ.15.5 లక్షల సబ్సిడీ మంజూరు చేశామన్నారు. అర్హులైన దివ్యాంగులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని www. tsobmms. cgg. gov. in వెబ్‌సైట్‌లో 16వ తేదీ నుంచి 28 తేదీ వరకు అందుబాటులో ఉంటుదని అన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక



జగిత్యాల: ఈనెల 20 నుంచి 22 వరకు పూణెలో యూనిసెఫ్ విజ్ఞాన ఆశ్రమం పూణె సంయుక్తంగా నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ శిక్షణ శిబిరానికి జగిత్యాల నుంచి పురాతన హైస్కూల్‌లో భౌతిక రసాయన శాస్త్రం ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్న ఆనందరావు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కరెంట్ వాడేస్తున్నారు..

• జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం • ఎప్పటికప్పుడు లోడ్‌ను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు • వినియోగదారులకు అవగాహన

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రోజు రోజుకు విద్యుత్ వినియోగం పెరుగుతోంది. దీంతో విద్యుత్ వాడకాన్ని నియంత్రించాలని విద్యుత్‌శాఖ అధికారులు వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో గతంలో విద్యుత్ వినియోగం అత్యధికంగా 367.90 మెగావాట్లు (డిసెంబర్ 20, 2022) ఉండగా, ప్రస్తుతం 388.02 మెగావాట్‌లకు (ఫిబ్రవరి 8, 2023) చేరింది. దీంతో అప్రమత్తమైన విద్యుత్ సిబ్బంది దిద్దుబాటు చర్యలకు పూనుకుంటున్నారు. జిల్లాస్థాయి విద్యుత్‌శాఖ అధికారులతో పాటు మండలస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సబ్‌స్టేషన్లలో విద్యుత్ లోడ్‌ను పరిశీలిస్తూ, కిందిస్థాయి సిబ్బందికి సూచనలు చేస్తున్నారు.

వినియోగదారులకు అవగాహన..

డిమాండ్‌కు సరిపడా విద్యుత్ పంపిణీ లేక వివిధ సంస్థల నుంచి ప్రభుత్వం అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేస్తోందని వినియోగదారులకు సూచిస్తున్నారు. విద్యుత్ కొనుగోలుకు ఆయా రాష్ట్రాల్లో పోటీఎక్కువగా ఉందని, ఒక్కో యూనిట్‌కు రూ.12కు మించి కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈక్రమంలో ఒక్క యూనిట్‌ను రూ.2–3కే వినియోగదారులకు అందిస్తుండడంతో తీవ్ర నష్టం వస్తోందని అవగాహన కల్పిస్తున్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడండి

సహజ వనరులైన బొగ్గు, నీరు, సూర్యరశ్మితో విద్యుత్ ఉత్పత్తి అవుతోందని, అలా ఉత్పత్తి అయిన కరెంట్‌ను మన ఇంటి వద్దకు, పోలం వద్దకు తీసుకెళ్లడానికి చాలాఖర్చుచేయాల్సి వస్తోందని సూచిస్తున్నారు. కాబట్టి వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడాలని సూచిస్తున్నారు. ఇంట్లో అయినా వీధి దీపాలైనా అవసరం లేనప్పుడు ఆర్పివేయాలన్నారు. అవసరం లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్లు, లైట్లు బంద్‌చేయాలని సూచిస్తున్నారు.

3లక్షల విద్యుత్ పంపుసెట్లు

జిల్లాలో దాదాపు 3లక్షల వరకు విద్యుత్ పంపుసెట్లు ఉన్నాయని దీంతో విద్యుత్‌ను ఎక్కువగా వినియోగిస్తారని ఈక్రమంలో రైతులకు విద్యుత్ వినియోగంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. రైతులు విద్యుత్ పంపుసెట్లకు ఆటో స్టార్టర్లు బిగించుకుని, అవసరమున్నా, లేకున్నా విద్యుత్‌ను ఎక్కువగా వృథా చేస్తున్నట్లు విద్యుత్ అధికారుల పరిశీలనలో తేలింది. దీనికి తోడు, విద్యుత్‌ను పొదుపు చేసేందుకు ఫ్యూజ్ బాక్స్‌లో కెపాసిటర్లు బిగించుకోవాలని సూచిస్తున్నారు.



వినియోగదారులతో అవగాహన కల్పిస్తున్న అధికారులు

అధికారులకు చీవాట్లు

జిల్లాకు కేటాయించిన విద్యుత్ కంటే ఎక్కువగా వినియోగిస్తుండటంతో జిల్లా అధికారులకు డిస్కం పంపిణీ సంస్థల ఉన్నతాధికారుల నుంచి చీవాట్లు వస్తున్నాయి. దీంతో జిల్లాకు కేటాయించిన టార్గెట్ మించకుండా, విద్యుత్‌ను కట్‌చేసే పనిలో అధికారులు నిమగ్రమయ్యారు. వేసవి దృష్ట్యా గృహ వినియోగంతో పాటు అటు వ్యవసాయానికి విద్యుత్ వినియోగం పెరగడంతో ప్రభుత్వం విద్యుత్ డిస్కంలను కొందామన్న విద్యుత్ దొరకని పరిస్థితి నెలకొందని వివిధ రాష్ట్రాలు కూడా పోటీపడి టెండర్లు దాఖలు చేస్తున్నాయని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు. దీంతో జిల్లాకు సరఫరా చేసే విద్యుత్‌నే పొదుపుగా వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా, లోడ్, వినియోగం ఎక్కడైతే ఎక్కువగా ఉంటుందో అక్కడి వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే విద్యుత్ కోతలు విధిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరగుతుండడంతో పాటు పంట పొలాలు ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేయడంతో విద్యుత్ డిమాండ్ ఎక్కువ కానుంది.

విద్యుత్ పొదుపుగా వాడాలి



వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడాలి. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కొందామన్నప్పటికీ ఎక్కువ రేటు ఉంది. అయినప్పటికీ విద్యుత్ దొరికే పరిస్థితి లేదు. కాబట్టి వినియోగదారులు ఉన్న విద్యుత్‌ను సక్రమంగా వినియోగించుకోవాలి.

– సత్యనారాయణ, జిల్లా విద్యుత్ శాఖ అధికారి, జగిత్యాల

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి

జగిత్యాలటౌన్: బీసీలకు న్యాయం చేయాలంటే బీసీ కమిషన్ వేసి, కులగణన చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కులగణన చేపట్టేటప్పుడు కులవృత్తులు, సామాజిక వెనుకబాటుతనం, ఆర్థిక వెనుకబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చడంలో ప్రస్తుత మండలి చైర్మన్ బండ ప్రకాశ్ కృషి అభినందనీయమని అన్నారు. ముదిరాజ్‌లకు న్యాయం చేయాలంటే బీసీ కులగణన చేసి కమిషన్ నివేదిక ఇవ్వాలని అన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ఇబ్బందులకు గురవుతున్న వర్గం బీసీలు మాత్రమేనని, నాలుగేళ్లుగా బీసీల స్వయంఉపాధికి సంబంధించి యాక్షన్‌ప్లాన్ లేదని విమర్శించారు. ముదిరాజ్‌లను బీసీ- ఏలో చేర్చాలని చట్టసభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ముదిరాజ్ కులస్తులు ఘనంగా సన్మానించారు. పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బండ శంకర్, బల్దియా ఫ్లోర్‌లీడర్ దుర్గయ్య, మన్సూర్,రాజేందర్, చందా రాధాకిషన్, గుంటి జగదీశ్వర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని సన్మానిస్తున్న ముదిరాజ్‌లు

యువకుడి అదృశ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ ఇమామ్ (25) యువకుడు అదృశ్యమైనట్లు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ ఇమామ్ గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో చుట్టుపక్కల బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతని తల్లి భక్తార్‌బీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముస్తాబాద్: మండలంలోని తుర్కపల్లి నక్కవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. గండిలచ్చపేటకు చెందిన ట్రాక్టర్లు తుర్కపల్లి నక్కవాగులో నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో ట్రాక్టర్‌ను పట్టుకుని ఠాణాకు తరలించామన్నారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

ముస్తాబాద్(సిరిసిల్ల): పొట్టచేత పట్టుకుని గల్ఫ్ బాటపట్టిన వలసజీవి.. స్వగ్రామం చేరి అప్పులు తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముస్తాబాద్‌లో వెలుగుచూసింది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన శ్యాగ గంగయ్య(43) గల్ఫ్‌బాట పట్టి అక్కడ సరైన ఉపాధిలేక మూడేళ్ల క్రితం ముస్తాబాద్ తిరిగి వచ్చాడు. ఈక్రమంలో గొర్రెలు కాస్తూ.. రూ. 5 లక్షలు అప్పులు చేసి కూతురు పెళ్లిచేశాడు. దీనికి తోడు గల్ఫ్‌కు వెళ్లిన అప్పులు తోడయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన గంగయ్య గురువారం ఇంట్లో పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు ఓప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. శుక్రవారం చికిత్సపొందు తూ మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు మహేశ్, కూతురు మౌనిక ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాలటౌన్: హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థినులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అక్రం మాట్లాడుతూ.. జిల్లాకేంద్రంలోని బీసీ గరల్స్ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇరుకైన గదుల్లో విద్యార్థులు నరకం అనుభవిస్తున్నారన్నారు. జిల్లాలోని హాస్టళ్లలో అడ్మిషన్ల కోసం ఎందరో అర్జీలు పెట్టుకుంటే కొందరికీ మాత్రమే సీట్లు లభిస్తున్నాయని, వసతి సౌకర్యం లేక విద్యార్థినులు విద్యకు దూరం అవుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలన్నారు. స్కాలర్‌షిప్స్ పెంచాలని, విద్యార్థుల ఆరోగ్యసంరక్షణకు మెడికల్ కిట్లు అందించాలని, విద్యార్థులకు వైద్యం అందించేందుకు ఎంబీబీఎస్ డాక్టర్లను నియమించాలన్నారు. ఇన్‌చార్జిల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న హాస్టళ్లకు వార్డెన్లను నియమించాలని కోరారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

క్రీడలతో స్నేహభావం పెంపు

• జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్

ధర్మపురి: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందిస్తాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని రాయపట్నం గ్రామంలో యువతను ప్రోత్సహించడానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాందేని మొగిలి ఆధ్వర్యంలో క్రికెట్‌టోర్నీ నిర్వహించారు. శుక్రవారం క్రీడల ముగింపులో బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి లక్ష్మణ్‌కుమార్ హాజరై విన్నర్ జట్టుకు రూ.5,016, రన్నర్ జట్టుకు రూ.3,016 నగదుతో పాటు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.దినేశ్, సింహరాజు ప్రసాద్, రఫీయోద్దీన్, కమలాకర్, అంజి, శరత్ ఇరు జట్ల సభ్యులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి

ప్రజా సమస్యల పరిష్కారానికే పల్లెనిద్ర



జాబితాపూర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- గ్రామస్తులతో మమేకం
- ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్ష
- రెండు గ్రామాలతో పాటు పలు కాలనీల్లో పర్యటన

జగిత్యాలరూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి పల్లెనిద్ర చేపడుతున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పల్లెనిద్ర మీరు నేను కార్యక్రమంలో భాగంగా జాబితాపూర్, ధర్మారం గ్రామాల్లో పలు కాలనీల్లో పర్యటించి మాట్లాడారు. అనంతరం ధర్మారం గ్రామంలో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ధర్మారం గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు పనులను, క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబాకర్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీచేశారు. జాబితాపూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులకు రూ.1.50 లక్షలతో నిర్మించే హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ నక్కల రాధ, సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, హెచ్‌సీఏ జిల్లామెంబర్ దావ సురేశ్, సర్పంచ్ మమత, నారాయణగౌడ్, ఎంపీటీసీ చిత్తారి స్వప్న, గిద్దె లక్ష్మీ, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, డీఈ జలేందర్‌రెడ్డి, ఏఈ రాజమల్లయ్య, నాయకులు పాల్గొన్నారు. జాబితాపూర్‌లో ధనలక్ష్మి హోంఫుడ్స్ యూనిట్‌ను సందర్శించి వాటిని రుచి చూశారు. పొలాస గ్రామంలోని శ్రీ పొలస్తేశ్వర స్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన సింహద్వారాన్ని ప్రారంభించారు. ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఆలయ చైర్మన్ కొండాల్‌రావు, కో–ఆప్షన్ మెంబర్ జావిద్, కమిటీ సభ్యులు మహేశ్, రంగు రాజయ్య, వినీత, భూమయ్య, మల్లయ్య, నాగరాజు, బేబిరాణి, తిరుపతమ్మ, అశోక్ పాల్గొన్నారు.

పింఛన్లు మంజూరు పత్రాలు పంపిణీ



వెల్గటూర్‌లో కేక్ కట్ చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీఎం పుట్టినరోజు సందర్భంగా అర్హులైన 45 మంది పేదలకు పింఛన్ మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. గతంలో పింఛన్లు మంజూరై అనివార్య కారణాలతో నిలిచిన 58 మందిలో 45 మంది లబ్ధిదారులకు కేసీఆర్ పుట్టినరోజు కానుకగా పింఛన్ మంజూరు పత్రాలు అందించారు. అంతకు ముందు మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి, మార్కెట్‌కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోడేటి సత్తయ్య, వెల్గటూర్ ఎండపల్లి మండల అధ్యక్షులు చల్లూరి రాంచంద్రం, సింహాచలం జగన్, ప్రధానకార్యదర్శి జూపాక కుమార్, మండల నాయకులు పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో మహిళపై దాడి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన వివాహిత ఎండపల్లి రాజేశ్వరిపై మంత్రాల నేపథ్యంలో ముగ్గురు దాడిచేసి చితకబాదారు. ఈ సంఘటనలో ఆమె గాయపడడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. రాజేశ్వరి భర్త దేవేందర్ జీవనోపాధి కోసం మహారాష్ట్రలోని నాందేడ్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తనకు మంత్రాలు వస్తాయని పది రోజులుగా ముగ్గురు వ్యక్తులు మానసికంగా వేధిస్తున్నారని రాజేశ్వరి పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఈనెల 13న గ్రామానికి చెందిన సుమలత, సత్తవ్వతోపాటు దుమాలకు చెందిన హరిత దాడిచేసినట్లు పేర్కొంది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించింది.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన వాహనంతో పోలీసులు

మెట్‌పల్లి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్యామ్ రాజ్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిపిన వివరాల ప్రకారం..ఆర్మూర్‌కు చెందిన బండారి ఎల్లయ్య జగిత్యాలలో రేషన్ బియ్యం సేకరించి బోలేరా వాహనంలో తరలిస్తుండగా, పక్కా సమాచారంతో పట్టణ శివారులో పట్టుకున్నారు. అందులో సుమారు 20 క్వింటాళ్ల బియ్యం ఉండగా, సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు ఎల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇంటిపన్ను వందశాతం వసూలు చేయాలి



ఇబ్రహీంపట్నం: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో వారంలోగా వందశాతం ఇంటిపన్ను వసూలు చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్ జీపీని ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, వర్మికంపోస్ట్‌షెడ్, నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా నీళ్ల పట్టించాలని, ఎండిన మొక్కల స్థానంలో విత్తనాలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.